క్లుప్తంగా

వీఆర్ సిద్ధార్థ కాలేజీలో ఓటు హక్కుపై అవగాహన



పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు పొందిన యువత తమ మొదటి ఓటును దేశం కోసం సద్వినియోగం చేయాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాలేజీలో ఎన్ఎస్ఎస్ విభాగం వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఓటు హక్కును నిజాయితీగా, నిర్భయంగా సద్వినియోగం చేసుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, ఇంగ్లీష్ విభాగాధిపతి రవిచంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఐ, ఎస్ఐకి సత్కారం



ఉయ్యూరు: వీరమ్మతల్లి తిరునాళ్ల విజయవంతంగా పూర్తవ్వడంలో పోలీసుల పాత్ర ఎనలేనిదని ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు అన్నారు. 15 రోజులు పాటు తిరునాళ్లను విజయవంతంగా నిర్వహించి బందోబస్తు ఏర్పాట్లు చేసి విశిష్ట సేవలు అందించిన ఉయ్యూరు సీఐ హబీబ్‌బాషా, పట్టణ ఎస్ఐ గణేష్‌కుమార్‌లను బుధవారం ఆయన ఘనంగా సత్కరించారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అధికారులు ఇరువురినీ సత్కరించి జ్ఞాపికలు అందించారు. పోలీసు అధికారులు, సిబ్బంది సేవలను ప్రశంసించారు.

జేఎన్టీయూ-కే క్రికెట్ పోటీలో రన్నరప్‌గా వీఆర్



పెనమలూరు: జేఎన్టీయూ-కే ఇంటర్ కాలేజీ క్రికెట్ పోటీల్లో కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ పోతిన రఘు బుధవారం వివరాలు తెలుపుతూ ఈ నెల 16 నుంచి 26వ తేదీ వరకు కంచికచర్ల మిక్ కాలేజీలో జేఎన్టీయూకే ఇంటర్ కాలేజీల క్రికెట్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో వీఆర్ సిద్ధార్థ జట్టు రెండవ స్థానంలో నిలిచి బహుమతి సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా కాలేజీలో బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ జట్టును అభినందించారు.

ఎనికేపాడులో అభివృద్ధి పరుగులు

- సుమారు రూ. 10 కోట్లతో అభివృద్ధి పనులు
- రూ. 82 లక్షలతో సచివాలయం, ఆర్బీకే, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణం
- నాడు–నేడు కింద సుమారు రూ. 1.35 కోట్లతో అభివృద్ధి
- రూ 3.40 కోట్లతో నూతన వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్ విస్తరణ



పూర్తి కావచ్చిన సచివాలయం, ఆర్బీకే, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఇది కదా.. అభివృద్ధి

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకూ సుమారు రూ. 10 కోట్లతో అంతర్గత రహదారులు, డ్రెయిన్లు, కాల్వగట్టు రహదారి పనులు, చెరువు పూడికతీత పనులు బీసీ, రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులను కొన్నింటిని పూర్తి చేశారు. మరికొన్ని శరవేగంగా జరుగుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాగా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పూర్తి సహకారం, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ప్రత్యేక చొరవతో అభివృద్ధి పనులు దిగ్విజయంగా జరుగుతున్నాయి.

రూ. 82 లక్షలతో ప్రభుత్వ భవనాల నిర్మాణం

గ్రామంలోని 24కే కల్యాణ మండపం సమీపంలో రూ. 40 లక్షలతో సచివాలయం, రూ. 20 లక్షలతో ఆర్బీకే సెంటర్, మరో రూ. 22 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. అలాగే గ్రామం మొత్తం అంతర్గత రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి పంచాయతీ నిధులు రూ. 26.50 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ. 77 లక్షలు, బీసీ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ. 15 లక్షలు, రజక కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ. 50 లక్షలు, కోటి రూపాయలతో విజయ ఆగ్రో కాలువ కట్ట, నల్లూరివారి కట్ట రహదారి అభివృద్ధి పనులను పూర్తి చేశారు. బీసీ స్మశానవాటిక వద్ద డ్రెయిన్, రహదారిని రూ. 25 లక్షలతో అభివృద్ధి చేశారు.

తాగునీటి సమస్యలకు చెక్

సుమారు 18 వేల మంది జనాభా నివసిస్తున్న ఈ గ్రామంలో ఎళ్ల తరబడి తాగునీటి సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. తాగునీటి ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర నిధులు సుమారు రూ 3.40 కోట్లు వెచ్చించి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ నిధులతో నాలుగు వాటర్ ట్యాంక్‌లను నిర్మిస్తున్నారు. 24కే కల్యాణ మండపం సమీపంలో 1.20 లక్షల లీటర్లు, బీసీ స్మశానవాటిక సమీపంలో 60 వేల లీటర్ల వాటర్ ట్యాంక్, విజ్ఞాన్ విహార్ పాఠశాల సమీపంలో 2.40 లక్షల లీటర్ల ట్యాంకు, జెండా చెట్టు సెంటర్‌లో 40 వేల లీటర్ల వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ ట్యాంకులతోపాటు గ్రామం మొత్తం పైప్‌లైన్ పనులను విస్తరిస్తున్నారు.

పంచాయతీ వెనుక చెరువుకు మోక్షం

గత టీడీపీ ప్రభుత్వంలో ఆక్రమణకు గురైన పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న చెరువుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మోక్షం లభించింది. గత పాలకులు రహదారి నిర్మాణం పేరిట ఇష్టారాజ్యంగా చెరువు స్థలాన్ని ఆక్రమించారు. పైగా గ్రామంలోని మురుగునంతటినీ తీసుకొచ్చి చెరువులో కలుపుతున్నారు. బురద, మురుగుతో నిండి ఉన్న చెరువు మొత్తాన్ని పూడిక తీయించి అభివృద్ధి పరిచారు. చెరువులో నీటిని నింపి సుందరీకరణ పనులు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, గ్రీనరి ఏర్పాటు చేయనున్నారు. ఆహ్లాదాన్ని పంచేందుకు చెరువులో పెడల్ బోటింగ్ సౌకర్యం కల్పించే ఆలోచనలో ఉన్నారు.

పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశాం



ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పరిష్కరించాం. గ్రామం మొత్తం రహదారులు, డ్రెయిన్లు పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచాం. చెరువులో కలుస్తున్న మురుగును కల్వర్టులు నిర్మించి కాలువలో కలిసేటట్లు చర్యలు తీసుకున్నాం. గ్రామం మొత్తం సుమారు రూ. 10 కోట్లతో అభివృద్ధి చేశాం.

మల్ల పూర్ణచంద్రరావు,
ఎనికేపాడు సర్పంచ్

గ్రామంలోని సచివాలయం-1,2 కలిపి ఇప్పటి వరకు వివిధ సంక్షేమ పథకాల రూపంలో కలిగిన లబ్ధి

పథకంపేరు	లబ్ధిదారుల సంఖ్య	చేకూరిన లబ్ధి
జగనన్న అమ్మ ఒడి	1290	రూ. 5.77 కోట్లు
జగనన్న విద్యా దీవెన	687	రూ. 2.83 కోట్లు
జగనన్న వసతి దీవెన	505	రూ.89.15 లక్షలు
వైఎస్సార్ రైతు భరోసా	640	రూ. 1.76 కోట్లు
వైఎస్సార్ పంట బీమా	58	రూ. 7.80 లక్షలు
వైఎస్సార్ సున్నా వడ్డీ పంటరుణాలు	110	రూ. 2.40 లక్షలు
రైతుల ఇన్‌పుట్ సబ్సిడీ	159	రూ. 19.90 లక్షలు
వైఎస్సార్ మత్స్యకార భరోసా	13	రూ. 2.10 లక్షలు
వైఎస్సార్ పింఛన్ కానుక	1453	రూ. 14.09 కోట్లు
వైఎస్సార్ చేయూత	708	రూ. 3.12 కోట్లు
వైఎస్సార్ ఆసరా	1732	రూ. 7.31 కోట్లు
వైఎస్సార్ సున్నావడ్డీ (ఎస్‌హెచ్‌జీ)	2114	రూ. 43.18 లక్షలు
వైఎస్సార్ కాపు నేస్తం	178	రూ. 73.35 లక్షలు
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	99	రూ. 26.55 లక్షలు
డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	517	రూ. 2.46 కోట్లు
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	352	రూ. 23.93 లక్షలు
హౌసింగ్ (నేరుగా చెల్లింపు)	353	రూ. 3.09 కోట్లు
వైఎస్సార్ బీమా	45	రూ. 70 లక్షలు
వైఎస్సార్ వాహన మిత్ర	141	రూ. 37.80 లక్షలు
జగనన్న చేదోడు	55	రూ. 11.50 లక్షలు
ప్రత్యేక కోవిడ్ సాయం	2,924	రూ. 29.24 లక్షలు
జగనన్న తోడు (వడ్డీ)	213	రూ. 96 వేలు
మొత్తం	14,346	రూ. 46.02 కోట్లు
పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ)		
ఇళ్ల స్థలాలు	803	రూ. 19.75 కోట్లు
జగనన్న విద్యా కానుక	676	రూ. 48 లక్షలు
ట్యాబ్‌ల పంపిణీ	98	రూ. 12.96 లక్షలు
జగనన్న తోడు(రుణాలు)	340	రూ. 63.30 లక్షలు
జగనన్న గోరు ముద్ద	368	రూ. 69.74 లక్షలు
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	907	రూ. 1.70 కోట్లు
ఇంటింటికీ రేషన్	3,428	రూ. 7.48 కోట్లు
మొత్తం	6,620	రూ. 30.88 కోట్లు
డీబీటీ, నాన్ డీబీటీ మొత్తం	20,966	రూ. 76.90 కోట్లు

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వంశీ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీమోహన్ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కొద్దిసేపు ముచ్చటించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతీ నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేసి వైఎస్సార్ సీపీ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలోని సిండికేట్ బ్యాంక్ కాలనీ ఒకటో రోడ్డుకు నామకరణం చేసిన బల్లెం నాగేశ్వరరావు వీధి బోర్డును ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్ వెంకటేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు శీలం రంగారావు, జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, రామవరప్పాడు సర్పంచి వరి శ్రీదేవి, పలు గ్రామాల ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ

కంకిపాడు: వైఎస్సార్ చేయూత పథకం కింద లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం గురువారం సాయంత్రం నాలుగు గంటలకు కంకిపాడు మార్కెట్ యార్డు సమీపంలో ప్రధాన రహదారి వద్ద నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పీ అనూష, ఏఎంసీ వైస్‌చైర్మన్ మాదు వసంతరావు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. బుధవారం వారు వివరాలు తెలుపుతూ కార్యక్రమానికి రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారన్నారు. అదే వేదికపై జగనన్న లే అవుట్‌ల్లో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

ప్రజాసంక్షేమానికి సీఎం జగనన్న కృషి



కానూరులో 'గడప గడపకు' కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్

పెనమలూరు: ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఓటు వేయాలని తాడిగడప మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్ కోరారు. కానూరు మురళీనగర్‌లో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత నవరత్నాలు అమలు చేశారని అన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలులోకి తీసుకువచ్చి గత నాలుగున్నర ఏళ్లుగా పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆదుకున్నారని చెప్పారు. ప్రధానంగా ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు అందజేశారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో అందరూ జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వేమూరి బాలకృష్ణ, తుమాటి శ్రీరాములు, కే సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం



ఉయ్యూరులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

ఉయ్యూరు: ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మున్సిపల్ వైస్‌చైర్మన్ సోలే సురేష్‌బాబు అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని 19, 20వ వార్డుల పరిధిలోని 10వ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. శిబిరాన్ని వైస్‌చైర్మన్ సురేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇంటి ముంగిటకే మెరుగైన వైద్య సేవలు తీసుకొచ్చారన్నారు. కంటి వెలుగుతో చూపును ప్రసాదిస్తున్నారని పేర్కొన్నారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ అర్షతున్నీసాబేగం, ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు, కౌన్సిలర్ గోన మదన్, మైనార్టీ నాయకుడు సలీంబేగ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వ్యవసాయ మార్కెట్ యార్డులో పాలకవర్గ సమావేశం



సమావేశంలో ఏఎంసీ చైర్‌పర్సన్ కరుణ, అధికారులు

గన్నవరం: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కరుణ అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ యార్డు లక్ష్యం రూ. 6 కోట్ల ఆదాయం నిర్దేశించగా, ఇప్పటి వరకూ రూ. 4.35 కోట్లు వచ్చినట్లు స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ ఎ.కిషోర్ తెలిపారు. మరో రూ. 70 లక్షలు మార్చి నెలాఖరుకు జమ కానున్నట్లు వివరించారు. గత ఆర్థిక ఏడాదితో పోల్చితే రూ. 1.80 కోట్ల ఆదాయం పెరిగినట్లు చెప్పారు. అనంతరం చైర్‌పర్సన్ కరుణ మాట్లాడుతూ ఆదాయం పరంగా మార్కెట్ యార్డు మెరుగైన వృద్ధిని సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న కాలంలో ఆదాయాన్ని మరింత పెంచడంతో పాటు రైతులకు మేలు చేసే మరిన్ని కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సూచన మేరకు స్థానిక మార్కెట్ యార్డుతో పాటు బాపులపాడు సబ్ యార్డులో మరమ్మతులను చేపట్టనున్నట్లు వివరించారు. గన్నవరం రైతుబజార్‌లో పార్కింగ్ ప్రాంగణం మెరక, అదనపు స్టాల్స్ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. కొత్తగా నున్న, తేలప్రోలులో రైతుబజార్ల నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ నాగబోయిన బాలమధురశ్రీ, సహాయ సంచాలకుడు నిత్యానందం, గ్రేడ్–3 కార్యదర్శి పీ జ్యోతి, పలువురు డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శంకర్‌విశ్వనాథన్

పెనమలూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలని చెన్నై ఫిలిప్స్ జనరల్ మేనేజర్ శంకర్‌విశ్వనాథన్ అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం సితార్ 2కే 24 శాస్త్ర సాంకేతిక, సాంస్కృతిక ప్రారంభ కార్యక్రమంలో ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. కమ్యూనికేషన్, రవాణా, హెల్త్‌కేర్ సాంకేతికత మన జీవితాన్ని మెరుగుపరిచిందని వివరించారు. ప్రతీ విద్యార్థి పరిశోధనలపై దృష్టి పెట్టి నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. సితార్‌లో పాల్గొన్న దాదాపు 2300 మంది విద్యార్థులు వివిధ పోటీల్లో సత్తాచాటారు. దాదాపు 30 టెక్నికల్ పేపర్స్ సమర్పించారు. టెక్నికల్ క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్ ప్రదర్శించారు. అనంతరం జరిగిన పలు సాంస్కృతిక పోటీల్లో సంప్రదాయ, పాశ్చాత్య నృత్యంతో పాటు పాటలు ఆలపించారు. పోటీల్లో గెలుపొందిన వారికి నాలుగు లక్షల విలువ చేసే బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ వెల్లంకి నాగభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, సితార్ కన్వీనర్లు డాక్టర్ బీవీ.సుబ్బారావు, డాక్టర్ ఎ.జయలక్ష్మి, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఆర్థిక సేవలు

నున్న(విజయవాడరూరల్): ఆర్థిక సంస్థలు అందించే సేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ అన్నారు. బుధవారం నున్నలోని తూర్పురామాలయం సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ బ్రాంచ్‌ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, గుంటక వీరారెడ్డి, సంస్థ ప్రాంతీయ మేనేజర్ కే హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపించుకుందాం

నున్న(విజయవాడరూరల్): వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకుందామని గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. బుధవారం నున్న గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆత్మీయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్దిరోజుల్లో ఎన్నికల కోడ్ రాబోతుందని విజయవాడరూరల్ మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో పట్టుదలతో పని చేసి మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని సూచించారు. గన్నవరం నియోజకవర్గంలో టీడీపీకి దిమ్మదిరిగే విధంగా వైఎస్సార్ సీపీకి మెజార్టీ రావాలని ఆకాంక్షించారు. సమావేశంలో పార్టీ నాయకులు కొమ్మా కోటేశ్వరరావు, యర్కారెడ్డి నాగిరెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వరరావు, శీలం రంగారావు, దేవగిరి ఓంకార్‌రెడ్డి, చెన్ను కమల్‌రాజ్, రూరల్ ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సహకార బ్యాంక్‌ల చైర్మన్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డీఓ



పెనమలూరు: యనమలకుదురులో శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి ఆలయంలో గురువారం నుంచి జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లును ఆర్డీఓ డి.రాజు బుధవారం పరిశీలించారు. కొండపై భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి బారికేడ్లు, చలువ పందిళ్లు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, ప్రసాదం అందజేయాలని ఈఓ గంగాధరరావును ఆదేశించారు. వైద్యసాయం, పారిశుద్ధ్యం, నదీ స్నానాల ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రధానంగా ప్రభోత్సవంలో ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్, ఈఓ గంగాధరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గన్నవరం: రోడ్డు భద్రత నిబంధనలను ఆటో డ్రైవర్లు తప్పకుండా పాటించాలని ట్రాఫిక్ సీఐ వాసా పెద్దిరాజు సూచించారు. స్థానిక ఆగిరిపల్లి రోడ్డులోని ఆటోస్టాండ్ వద్ద డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఆటోలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. రోడ్లపై ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిర్దేశిత ప్రాంతాల్లోనే ఆటోలను పార్క్ చేయాలని తెలిపారు. వేగ నియంత్రణ పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలని సూచించారు. అనంతరం దావాజిగూడెంలోని ఎన్టీటీఎఫ్ కళాశాలలో విద్యార్థులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పలువురు ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

గన్నవరం రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి షేక్‌ఇమాం ఆకాంక్షించారు. ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో బుధవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సమాజంలోని వివిధ రంగాల్లో ఆదర్శంగా రాణిస్తున్న పలువురు మహిళలను సత్కరించారు. ఇందిరాగాంధీ, మథర్‌థెరిస్సా, కల్పనాచావ్లా, సావిత్రిభాయి పూలే, కిరణ్‌బేడీ వంటి వారు ఆదర్శమన్నారు. ప్రిన్సిపాల్ షేక్ జాకీరాసుల్తానా, వెల్ఫేర్ అసిస్టెంట్ జె.నానారావు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందించిన వలంటీర్

హనుమాన్‌జంక్షన్ రూరల్: హైదరాబాద్ వెళ్లి.. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది బంధువుల ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వృద్ధుడికి బాపులపాడు మండలం రేమల్లేకు చెందిన వలంటీర్ పింఛన్ అందజేసింది. గ్రామానికి చెందిన యనమదల సాంబశివరావు మోకాలు శస్త్రచికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న వలంటీర్ చౌటపల్లి చిన్నారి బుధవారం హైదరాబాద్ వెళ్లి ఆ వృద్ధుడికి పెన్షన్ అందించింది.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బొమ్ములూరులోని దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల(వేమగిరి)కు చెందిన కంటి వైద్య నిపుణులు ఉచితంగా సేవలు అందించారు. ఆధునిక వైద్య పరికరాలతో 550 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.